


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శుక్రవారం 12 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




# ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు





భానుపురి /సూర్యాపేట టౌన్

సర్ పేరుతో ఓటర్ల హక్కులను హరించవద్దని ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు, నల్లగొండ పార్లమెంట్ ఇంచార్జ్ బలమురి వెంకట్ ఏఐసీసీ ఓబీసీ నాయకులు, సూర్యాపేట నియోజకవర్గ సమన్వయ కర్త ప్రొ. కత్తి వెంకట స్వామి ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యపిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. గురువారం పట్టణంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్ లో బూత్ లెవల్ ఏజెంట్ల కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ వలన పేదలు, కార్మికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు అవసరమైన పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అయితే వారి ఓటు హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ కు ఉందన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అంతటి గొప్ప ఆయుధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ హరించరాన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే చర్యలు అంగీకరించబోమని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తుందని. ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తుందన్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి గారు, తూముల సురేష్ రావు గారు, ధారవత్ వీరన్న నాయక్ గారు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి గారు, మున్సిపల్ కౌన్సిలర్లు, బూత్ లెవల్ ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.




## ఎంఎస్ఆర్ పాఠశాలపై ఆరోపణలు అవాస్తవం

భానుపురి/సూర్యాపేట టౌన్




ఎంఎస్ఆర్ పాఠశాలపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. బుధవారం నిర్వహించిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సాధారణ ఫీజుతో నాణ్యమైన విద్య, విలువలతో కూడిన బోధన అందిస్తున్న ఎంఎస్ఆర్ పాఠశాలపై తప్పుడు ప్రచారం చేయడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఫీజులు పారదర్శకంగా నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారని, యూనిఫాంలు, పుస్తకాలు కొనుగోలు చేయాలని ఎలాంటి ఒత్తిడి ఉండదన్నారు. నిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్కు ఫిర్యాదు చేయడంతో పాటు పరువు నష్టం దావా కూడా వేస్తామని హెచ్చరించారు. పాఠశాల నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడుతూ తమపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఏవైనా లోపాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని, నిరాధార ఆరోపణలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాల పై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలి






భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ వి సి హాల్ నందు ఉపాధి హామీ పథకం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయుత పెన్షన్లలో ఫేస్ అథెంటికేషన్ త్వరగా పూర్తిచేయాలని పెన్షన్లలో అర్హులు, అనర్హుల జాబితా రిజిస్టర్లు తప్పక నిర్వహించాలని, ఎంపీడీవో లాగిన్ లో ఉన్న పెండింగ్ వాటికి అప్రూవల్ ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సంబంధించి అన్నింటికి మరుగుదొడ్లు పూర్తి చేయాలని అలాగే కొత్తగా నిర్మించుకున్న ఇండ్లకు కూడా మరుగుదొడ్లు మంజూరు చేయాలని, గ్రామ పంచాయతీల దగ్గర ఉన్న వాటికి సామూహిక మరుగుదొడ్లు పూర్తి చేయాలని రానున్న వర్షాల దృష్ట డ్రైనేజ్, ఇంకుడు గుంతలు పూర్తి చేయాలని రాబోవు వన మహోత్సవం సందర్భంగా చెట్లు నాటడానికి స్థలాలను గుర్తించి గుంతలు తీయించాలని, పండ్ల తోటలు మునగ తోటలు పెంచు లబ్ధిదారులను గుర్తించి వారికి ఉపాధి హామీ కింద లబ్ధి చేకూరేలా చేయాలని ఉపాధి హామీ మెటీరియల్ ప్రభుత్వం నుండి విడుదలైన నిధులను పూర్తి అయిన పనులకు చెల్లింపులు చేసి నిధులు వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పి డి సన్యాసయ్య, జడ్పి సి ఇ ఓ శిరీష, డీపీఓ యాదగిరి, అడిషనల్ డిఆర్డిఓ చంద్రశేఖర్, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనుల నిర్లక్ష్యం వలన చిన్న వర్షానికే బురద అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయని సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. సూర్యాపేట మునిసిపాలిటీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ చేస్తున్న పాదయాత్రలో భాగంగా గురువారం 46వ వార్డులో పర్యటించి రోడ్లను, మురుగు కాలువలను పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర అఖిల్ కుమార్ మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం వలన, ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి ఈగలు దోమలు పాములు క్రిమి కీటకాలకు వీధులన్నీ నిలయమైనాయని ఆవేదన చెందారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల నిర్లక్ష్యం వలన రోడ్ల పైన నడుస్తున్న పాదచారులు, వృద్ధులు,పిల్లలు కూడా అతుకుల గతుకుల రోడ్ల వలన కింద పడిపోయి కాళ్లు చేతులు విరగొట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. మొన్న కురిసిన చిన్న వర్షానికే రోడ్లన్నీ బురద మయం అయ్యి నడిచే పరిస్థితి లేదన్నారు.త్వరలో పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న వేళ జరగబోయే ప్రమాదాలను తలచుకుంటే ఎంతో ఆవేదన కలుగుతుందని అన్నారు. అందుకని అన్ని వార్డులలోని డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించి, రోడ్లన్నీ యుద్ధ ప్రాతిపదికన సిమెంట్ రోడ్లుగా నిర్మించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చేసే పనులలో కూడా నాణ్యత లేదన్నారు. వీటిపై అధికారులు విచారణ చేసి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా పట్టణంలో నీటి సమస్య వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.వెంటనే కమిషనర్ గారు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి అన్నారు. లేనియెడల రాబోయే రోజులలో ప్రజల నుండి తీవ్ర ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఏఐ వినియోగంతో పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుంది

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్




ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, మాస్టర్ ట్రైనర్స్ వాసుదేవన్ నటరాజన్ దేవరాజ్, రాహుల్, జిల్లా అధికారులు , కలెక్టరేట్ పరిపాలన అధికారి సంబంధిత అధికారులు,అన్నీ శాఖల సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## సూర్యాపేటలో గాలి దుమారం తో అంతరాయం



భానుపురి /సూర్యాపేట రూరల్

సూర్యాపేట ఖమ్మం జాతీయ రహదారి సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని బిబి గూడెం మధుర హోటల్ సమీపంలో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. రాత్రివేళ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి, రోడ్డుపై విరిగిపడిన చెట్లకొమ్మలను తొలగించాలని వాహన దారులు కోరుతున్నారు.

# అత్యాధునిక సాంకేతికతతో కూడిన విద్య ఆదిత్య స్కూల్ ప్రత్యేకత





భానుపురి /సూర్యాపేట టౌన్

నేటి తరం విద్యార్థులకు అణుగుణంగా అర్థవంతమైన విజ్ఞానం, అత్యాధునిక సాంకేతికతతో కూడిన విద్య ఆదిత్య స్కూల్ విత్ ఏఐ టెక్నాలజీ అందిస్తుందని ఆ పాఠశాల డైరెక్టర్ చింతమళ్ల రమేష్ అన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే చిన్నతనం నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించారు కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో సిసి కెమెరాలు, ఎంపరింగ్ యంగ్ మైండ్స్ విత్ ఏఐ, నీవ్ పాత్ యాప్ తో పిల్లలకు విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని కృష్ణానగర్ కాలనీ నందు బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలను చైర్మన్ చింతమళ్ల సుజాతనిర్మల్ కుమార్లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కట్కోజు విద్యా భారతి, కరస్పాండెంట్ కట్కోజు భరత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వరి కొయ్యలు తగులబెట్టడం పై చర్యలు తీసుకోవాలి

భానుపురి /ఆత్మకూర్ (ఎస్)

వరి కొయ్యలు తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, పంట పొలాల్లో వరి కొయ్యలను తగులబెట్టవద్దని పోలీసు శాఖ, వ్యవసాయ అధికారులు పలుమార్లు అవగాహనకల్పిస్తున్నప్పటికీ, కొందరు రైతులు వాటిని పట్టించుకోకుండా వరి కొయ్యలను దహనం చేస్తున్నారు. ఆత్మకూరు మండలం దుబ్బ తండాలో తాజాగా వరికొయ్యలను తగులబెట్టిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. రైతులకు గ్రామ సమావేశాలు, పొలం స్థాయి అవగాహన కార్యక్రమాల ద్వారా వరి కొయ్యలు తగులబెట్టడం వల్ల కలిగే నష్టాలపై వివరించినప్పటికీ, కొందరు అదే పనిని పునరావృతం చేస్తున్నారని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఈ చర్యలకు పాల్పడిన వారిపై రూ. 5,000 వరకు జరిమానాలు విధిస్తున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం నిబంధనలను పట్టించుకోకుండా వరి కొయ్యలను దహనం చేస్తున్నట్లు తెలుస్తోంది. వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల గాలి కాలుష్యం పెరిగి శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాకుండా భూమిలోని సూక్ష్మజీవులు నశించి, నేల సారవంతత తగ్గిపోతుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే ఈ చర్యలను రైతులు స్వచ్ఛందంగా మానుకోవాలని, వరి అవశేషాలను సేంద్రియ ఎరువుల తయారీకి లేదా ఇతర ఉపయోగాలకు వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రైతులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరి ంచాలని స్థానికులు కోరుతున్నారు.



## పట్టణంలో అండర్ డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణంలో గత 8 నెలల నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ ఆఫీసులో మున్సిపల్ కమిషనర్ కి సూర్యాపేట మౌలిక సమస్యల మీద మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గోతులు తీస్తున్నారో వెంటనే ఆ గోతులను పూర్చకపోవటంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారు అనేకమార్లు కిందపడి కాళ్లు చేతులు విరగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయని అన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతుంది వర్షాలు పడుతున్నాయి రోడ్లన్నీ బురదగా ఉండటంతో మరో రెండు రోజుల్లో స్కూళ్లు ఓపెన్ అవుతున్నాయి పిల్లలను స్కూలుకు తీసుకెళ్లే క్రమంలో గోతుల ద్వారా ప్రమాదాలు జరుగుతాయని తెలియజేశారు. పట్టణంలో నాళాలలో ఉన్న మట్టిని పూడిక తీయకపోవడం వల్ల వర్షాలు పడటంతో రోడ్డు మీదకి నీరు ప్రవహిస్తుందని అన్నారు. అలాగే అన్ని వార్డులలో మురికి కాలువలోకి దోమల మందు కొట్టించి దోమలు రాకుండా ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఐ కార్యవర్గ సభ్యులు దంతాల రాంబాబు, ఖమ్మం పాటి రాము, ఖమ్మంపాటి లక్ష్మి, పుత్తూరు లావణ్య, చిమిట ఈశ్వరమ్మ, ఖమ్మం పాటి సాయి పాల్గొన్నారు.

## దత్త మందిరంలో అధిక జ్యేష్ఠ వాయినాలు



భానుపురి /సూర్యాపేట కల్చరల్

అధిక జేష్ఠ మాసం పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ లో గల శ్రీ దత్త సాయి మందిరంలో గురువారం వాయనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ రకములతో అనఘాదేవికి 33 రకాల వాయనాలు సమర్పించారు. ఈ సందర్భంగా సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణము, లలిత సహస్రనామ పారాయణము, మణిద్వీప వర్ణన చేశారు. అర్చకులు రమణయ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలందరికీ వాయనాలు అందజేశారు.

## ఈనెల 17న ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లాలో పర్యటన

భానుపురి /నల్గొండ

సుమారు 14,500 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల శంకుస్థాపన నిమిత్తం ఈ నెల 17 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, కనగల్ వస్తున్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న హ్యాం రోడ్ల పైలాన్, బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం,బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. హ్యాం రోడ్లతోపాటు, మరి కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చే ఇక్కడ నుండే శంకుస్థాపనలు నిర్వహించే విషయమై సమావేశంలో మంత్రి అధికారులతో చర్చించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి తో ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దర్శనం చేయించి ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని ఆధునికరించేందుకు చర్యలు తీసుకుంటున్నందున అవకాశం ఉంటే దేవాలయ ఆధునికరణ పనులకు కూడా ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి తెలిపారు. శిలాఫలకం, ఇతర ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించాలని కొరారు. అనంతరం హ్యాం రోడ్ల శంకుస్థాపన, బహిరంగ సభకు హాజరయ్యే విధంగా ప్రాథమికంగా ఏర్పాట్లు చేసేలా మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. అంతేకాక సభకు హాజరయ్యే ప్రజల కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, ఏర్పాట్లలో ఎక్కడ లోపం లేకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ , జిల్లా అధికారులతో కలిసి గురువారమే కనగల్ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు,హ్యాం రోడ్ల శంకు స్థాపనకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, అలాగే పైలాన్ ఏర్పాటు చేసే స్థలం , బందోబస్తుతో సహా పరిశీలించి నట్లు వెల్లడించారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,డి ఈ గణేష్, జెడ్పిసిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఈ సమావేశంలో ఉన్నారు .



## జులై 5 న భువనగిరిలో జరిగే సభను విజయవంతం చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, సూర్యాపేట లో ఇప్పటికీ దొరల పాలన కొనసాగుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ విమర్శించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి లక్షలాది మందికి చేరవేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ లో జరిగిన ఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, సూర్యాపేటలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. పేదలు మున్సిపాలిటీ అనుమతుల తో ఇళ్లు నిర్మించుకుని పదేళ్లకు పైగా నివసిస్తున్న వెంచర్ల లో అక్రమ పద్ధతుల్లో డాక్యుమెంట్లు సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కొందరు వ్యక్తులు అధికారిక పదవులు లేకపోయినా పాలనను తమ చుట్టూ తిప్పుకుంటూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సూర్యాపేటలో పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు దొరల ఆధిపత్యానికి బలి కావద్దని పిలుపునిచ్చారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ వ్యవస్థలు సామాన్య ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాలని, కొందరి ప్రయోజనాల కోసం కాకుండా ఉండాలని సూచించారు.ఇటీవల వజ్ర హోమ్స్, వీవీఎన్ ఎన్క్లేవ్ ప్రాంతాల్లో చట్టబద్ధంగా మున్సిపాలిటీకి ఇవ్వాల్సిన పార్కు స్థలాలను అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. దీంతో అక్కడ నివసిస్తున్న బడుగు బలహీన వర్గాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఈ అంశాలపై సూర్యాపేట మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో జరిగే అక్రమాలకు సంబంధిత అధికారులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.పేదల ఇళ్లను కాపాడేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, సోషల్ మీడియా ద్వారా ప్రజలు చూపిన స్పందన రాష్ట్రంలో మెజారిటీ వర్గాల ఐక్యతకు సంకేతమని తెలిపారు.ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. జూలై 5న భువనగిరిలో నిర్వహించే సభను విజయవంతం చేసి సామాన్యులకు రాజకీయ అధికారం దక్కేలా కృషి చేయాలని కోరారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని, ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి పోరాడుతామని నాయకులు స్పష్టం చేశారు. “మన ఓటు మనమే వేసుకుని అధికారాన్ని సాధించాలి. అగ్రకుల ఆధిపత్యం, దురహంకారం, కబ్జాకోర తత్వానికి ముగింపు పలకాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు బొల్లే సైదులు, మహిళ అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్లు దొంగిలించి మనీ యాప్‌ల ద్వారా నగదు కాజేస్తున్న ముఠా అరెస్ట్





భానుపురి /సూర్యాపేట టౌన్

బస్సుల్లో ప్రయాణించే వారి మొబైల్ ఫోన్లను దొంగిలించి, వాటిలోని మనీ యాప్‌ల ద్వారా బ్యాంకు ఖాతాల నుంచి నగదు కాజేస్తున్న ముఠాను సూర్యాపేట జిల్లా సీసీఎస్, తుంగతుర్తి పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. నిందితుల నుంచి రూ. 2.70 లక్షల నగదు, 27 స్మార్ట్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల ఉప్పలయ్య ఫోన్ దొంగిలించిన నిందితులు, అతని బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1.80 లక్షలను మనీ యాప్‌ల ద్వారా వివిధ ఖాతాలకు బదిలీ చేసి డ్రా చేశారని తెలిపారు. అలాగే తుంగతుర్తికి చెందిన వ్యాపారి దుగ్యాల వెంకటేశ్వరరావు ఫోన్ దొంగిలించి, అతని ఖాతా నుంచి సుమారు రూ. 97 వేల నగదును కాజేశారని చెప్పారు.ఈ రెండు ఘటనలపై తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో నిందితులను గుర్తించిన పోలీసులు తుంగతుర్తి బస్టాండ్ వద్ద వాహన తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా, ప్రధాన నిందితుడు పాముల రాము అలియాస్ ఎరుకల రాముతో పాటు ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. నిందితులు బస్టాండ్లు, బస్సుల్లో ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని ఫోన్లు దొంగిలిస్తున్నారని, ఫోన్లలో సులభమైన స్క్రీన్ లాక్, యూపీఐ పిన్‌లు ఉంటే వాటిని ఛేదించి డబ్బులు బదిలీ చేసి నగదుగా మార్చుకుంటున్నారని తెలిపారు. రైతు, వ్యాపారి ఖాతాల నుంచి దొంగతనానికి గురైన మొత్తం రూ. 2.70 లక్షలను రికవరీ చేసినట్లు చెప్పారు.ప్రజలు తమ మొబైల్ ఫోన్లు, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి మనీ యాప్‌లకు 1234, 0000, పుట్టిన తేదీలు వంటి సులభమైన పిన్ నంబర్లు కాకుండా బలమైన పాస్‌వర్డ్లు, పిన్ నంబర్లు ఉపయోగించాలని ఎస్పీ సూచించారు.కేసును సమర్థవంతంగా ఛేదించిన డీఎస్పీ ప్రసన్న కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐలు యాదవేందర్ రెడ్డి, హరికృష్ణ, క్రాంతికుమార్, టెక్నికల్ టీమ్ సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.